క్లుప్తంగా

నేటి నుంచి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో ఆదివారం నుంచి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రకాశం జిల్లా పరిధిలోని పామూరు, సీఎస్‌పురం మండలాలు, నెల్లూరు జిల్లా పరిధిలోని సీతారాంపురం మొత్తం 3 మండలాల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.30,116, రూ.20,116, రూ.10,116 అందజేస్తామన్నారు.

పాలిసెట్‌లో శానంపూడి విద్యార్థినికి 167వ ర్యాంకు


ధనేకుల రూపాదేవి

సింగరాయకొండ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పాలిసెట్ ఫలితాల్లో మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన విద్యార్థిని ధనేకుల రూపాదేవికి రాష్ట్రస్థాయిలో 167వ ర్యాంకు లభించింది. ఈమె తండ్రి పీసీ పల్లి మండలం మురుగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రూపాదేవి మాట్లాడుతూ బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ చదివి సివిల్స్‌లో సత్తా చాటి ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని అన్నారు. రూపాదేవిని మంత్రి స్వామి అభినందించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

హనుమంతునిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం.మాధవరావు అన్నారు. మండలంలోని వేములపాడు కంభం రోడ్డులో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

పొన్నలూరు: వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ పుల్లారావు సూచించారు. పొన్నలూరులో శనివారం ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించాలి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ, ఏపీఓ

సీఎస్‌పురం(పామూరు): జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని ప్రత్యేకాధికారి, కనిగిరి డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఏపీఓ శ్రీనివాసనాయక్‌తో కలిసి పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తే వేతనం రూ.307 అందుతుందన్నారు. పనికి హాజరుకానివారికి హాజరువేయడం, ఒకరిబదులు ఒకరు రావడం, 18 సంవత్సరాలలోపు పిల్లలను పనికి రానీయడంవంటి తప్పులుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏ కాశయ్య పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


కలికవాయ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రమాణం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులు, తల్లులకు సంసిద్ధత మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ మాట్లాడుతూ వేసవిలో చిన్నారులు, తల్లులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తల్లులచే ప్రమాణం చేయించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టంగుటూరు సీడీపీఓ మల్లీశ్వరి, సూపర్‌వైజర్లు షేక్ సైదాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాలలకు షూరిటీ లేని రుణాలు మంజూరు చేయాలి

టంగుటూరు: తెలంగాణ తరహాలో సిబిల్ స్కోర్ చూడకుండా షూరిటీ లేని రుణాలను మాలలకు మంజూరు చేయాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌బాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మాలల జేఏసీ అధ్యక్షుడు కొప్పోలు ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు మేడికొండ లక్ష్మీనారాయణ, ఎర్రజల్ల రమేష్, మేడిద రవి, ఉద్యోగ సంఘ నాయకులు శ్రీకాంత్, మల్లికార్జునరావు, మాల ఉద్యోగ సంఘ ఉపాధ్యక్షుడు సురేష్, సుధాకర్, జేఏసీ కోశాధికారి రాజు, జిల్లా నాయకులు, మాల యువత విభాగం అధ్యక్షుడు రాంబాబు, కసుకుర్తి రాజు, జిల్లా మాల ఉద్యోగులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

ఉపాధి పని.. బినామీలకు హామీ


శాఖవరంలో వసతులు లేకుండా మండుటెండలో ఉన్న కూలీలు


కొండసముద్రం గ్రామంలో పనులు చేయిస్తున్న సీనియర్ మేట్

- ఉపాధి హామీ పనిలో బినామీ ఫీల్డ్ అసిస్టెంట్ల హవా
- పని జరిగే చోట కనిపించని ఫీల్డ్ అసిస్టెంట్‌లు
- కనీస వసతులు కల్పించకుండా పనులు చేయిస్తున్న వైనం

వలేటివారిపాలెం: ఉపాధి హామీ పథకం కూటమి నాయకులకు వరంగా మారింది. అటు అధికారులు.. ఇటు కూటమి నాయకులు కలిసి ఊర్లు పంచుకుంటూ బినామి పేర్లతో నిధులు కొల్లగొడుతున్నారు. మండలంలో 21 పంచాయితీల్లో మార్చి నుంచి ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. గ్రామాల్లో పనులు చేయించాలంటే ఫీల్డ్ అసిస్టెంట్ చాలా కీలకం. ఇతని అధీనంలోనే పనులు ఎక్కడ ఉన్నాయో గుర్తించి చేయిస్తుంటారు. అయితే ఇక్కడ కూటమి నాయకుల అదను చూసుకొని ఉండాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్ చోట మరో పేరు మీద బినామితో పనులు చేయిస్తున్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ఇబ్బంది లేకుండా నీరు, నీడ ప్రథమ చికిత్స బాక్స్‌లను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్ మీద ఉంది.

ఫీల్డ్ అసిస్టెంట్ లేకుండా పనులు..

దానికి విరుద్ధంగా శాఖవరం గ్రామంలో బినామి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ ఇద్దరూ కుమ్మక్కై లేని వారికి మస్టర్లు వేసుకుంటూ, కొలతల్లో అవకతవకలు చేసుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ లేకుండా పనులు ఎలా చేస్తున్నారని సాక్షి టెక్నికల్ అసిస్టెంట్‌ను ప్రశ్నించగా, ఫీల్డ్ అసిస్టెంట్ లేకుండా పనులు అవుతున్నప్పుడు ఆయన ఉండాల్సిన అవసరం ఏముంది.. ఏమైనా సమాచారం కావాలంటే ఫీల్డ్ అసిస్టెంట్‌తో వెళ్లి సంప్రందిచండని పొగరుగా సమాధానం ఇచ్చారు.

బోగస్ హాజరు..

అదే విధంగా కొండసముద్రం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకండా సీనియర్ మేట్ మస్టర్లు వేసుకుంటూ కూలీలకు వసతులు లేకుండా ఎండలో పని చేయిస్తున్నారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా తాను బాధ్యతలు చేపట్టే ముందే ఎమ్మెల్యేకు, ఏపీడీవో, ఏపీవోలకు పని దగ్గర ఉండి చేయంచడం వీలు పడదని చెప్పేసే బాధ్యతలు చేపట్టానని సమాధానం ఇచ్చారు. కొండసముద్రం టీఏ కొండల్‌రావు మాట్లాడుతూ అన్ని సమయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ ఉండాల్సిన అవసరం లేదు. సీనియర్ మేట్ పనులు చూసుకుంటారని ఫీల్డ్ అసిస్టెంట్‌కు వత్తాసు పలికాడు. ఈ బినామి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏల ప్రవర్తనపై ఏపీడీవో బాబురావును వివరణ కోరగా విచారణ చేసి బినామిలను తొలగించి టీఏలు మీద చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు.

రైతు నాయకులను కూడా ప్రలోభపెడుతున్నారు


పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు

- కార్పొరేట్ సంస్థలు దిగజారాయి
- ప్రభుత్వాలు వెంటనే మొద్దు నిద్ర వీడాలి
- సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు

కొండపి: రైతు నాయకులను ప్రలోభపెట్టే స్థాయికి కార్పొరేట్ సంస్థలు దిగజారాయని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు విమర్శించారు. కొండపి మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో పొగాకు రైతులతో శనివారం ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలం జరుగుతున్న తీరును పరిశీలించారు. స్థానిక పొగాకు బోర్డు వేలం కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగాకు రైతు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ప్రభుత్వాలకు ఈ నెలాఖరు వరకు సమయమిస్తున్నామని, ఈలోపు రైతుకు గిట్టుబాటు ధర కల్పించి పొగాకు కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతుల ఉగ్రరూపం ఏ విధంగా ఉండబోతుందో చూస్తారని అల్టిమేటం జారీ చేశారు. రైతుల సమస్యలడిగి తెలుసుకుంటున్న సందర్భంలో.. పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగిపోయాయని, వేలం కేంద్రంలో ఆశించిన స్థాయిలో ధరలు లభించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని వాపోయారని తెలిపారు. నాణ్యమైన పొగాకును కూడా చాలా తక్కువ ధరకి కొంటున్నారని ఆరోపించారు. బర్లీ పొగాకు రైతులు కూడా ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మంత్రి స్వామి రైతుల పక్షాన నిలబడి పొగాకుకు మంచి ధర కల్పించే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడాలని డిమాండ్ చేశారు. రైతు నాయకులను ప్రలోభపెట్టి వారి పొగాకుకు మాత్రమే మంచి ధర కల్పించి నోరు మూపించి మిగిలిన రైతులకు అన్యాయం చేసే కుట్రలకు కంపెనీలు పాల్పడుతున్నాయని విమర్శించారు. 240 మిలియన్ల పొగాకు పండిస్తే ఇప్పటికి 65 రోజుల్లో కేవలం 46 మిలియన్ల పొగాకు మాత్రమే కొనుగోలు చేశారని, ఇలా అయితే సంవత్సరం మొత్తం వేలం నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నాయకుడు కేజీ మస్తాన్, రైతులు బొద్దులూరి లక్ష్మీనరసింహం, నేతి వెంకటేశ్వర్లు, గుమ్మల్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

శీతల గిడ్డంగుల్లో బేళ్ల వివరాలు తెలియజేయాలి

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న పొగాకు బేళ్ల వివరాలు తెలియజేయాలని వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్ అన్నారు. శనివారం పొగాకు వేలం సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల దగ్గర ఉన్న బేళ్ల వివరాలను బోర్డుకు తెలియపరచాలని, అనధికారికంగా పొగాకు అమ్మరాదని సూచించారు. శనివారం నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 725 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. వాటిలో 531 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 194 బేళ్లను తిరస్కరించారు. పొగాకు కేజీ గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.209, సరాసరి ధర రూ.239.39గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

కేజీ పొగాకు గరిష్ట ధర రూ.280

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.280 పలికినట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 780 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. వాటిలో 582 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 198 బేళ్లను తిరస్కరించారు. కేజీ కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.242.53గా నమోదైంది. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు దెబ్బతిన్న బిల్డింగ్

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మహమ్మదాపురంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులు వీచిన గాలి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసింది. ఉరుముల మెరుపులకు గ్రామానికి చెందిన గాంధ్ర సీతయ్య భవనంపై పిడుగు పడింది. పిడుగుపాటుకు భవనం దెబ్బతిని లోపలికి రంధ్రం ఏర్పడింది. పెంకులు లేచి ఇళ్లపై, రోడ్లపై ఉన్న ప్రజలపై పడడంతో గ్రామస్తులు భయ భ్రాంతులకు గురిచేశాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేరని ఇంటి యజమాని సీతయ్య తెలిపారు.

ఏపీజీఈఏ సమావేశాన్ని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న కిరణ్ కుమార్‌రెడ్డి

కనిగిరిరూరల్: ఏపీజీఈఏ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక వైష్ణవీ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కనిగిరి తాలూకా స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీజీఈఏ రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశం ఈ నెల 5న విజయవాడలో జరుగుతుందన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్య నారాయణ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, రాయితీలు, పీఆర్సీ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై భవిష్యత్ కార్యచరణ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. రామన వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్ బాబు, జీవీ సుబ్రహ్మణ్యం, కోశాధికారి శ్రీనివాసులు, కె.ప్రసాద్‌రెడ్డి, ఎస్‌కే మస్తాన్‌వలి, పి. గోపినాథ్, చంద్ర కుమారి, ఉస్మాన్ బాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పామూరు: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక కందుకూరురోడ్డులో ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని ప్రజలు సదినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఈఓపీఆర్‌డీ అరవిందారెడ్డి అన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డిలు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.

నిధుల వినియోగంపై విచారణ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేట పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై కనిగిరి డీఎల్‌పీఓ హనుంతరావు శనివారం విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. వర్షంకారణంగా క్షేత్రస్థాయిలో పరిశీలన సాధ్యం కానందున మరోసారి విచారణ చేస్తానని డీఎల్‌పీవో తెలిపారు. ఈఓపీఆర్‌ఆర్‌డి రమణయ్య, పీఎస్ రమణనాయక్, ఫిర్యాదుదారులు తిరుపతయ్య, వి.ప్రసాద్, జి.తిరుపతయ్య, బి.సుబ్బారావు, ఎం.వెంకటకొండయ్య, పలువురు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మంత్రి స్వామి


జరుగుమల్లిలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి మనిషి ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

పొన్నలూరు: పరిశుభ్రమైన గ్రామాల కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో డాక్టర్ సుజాత సూచించారు. మండలంలోని శింగరబొట్లపాలెం గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈఓఆర్డీ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాయకొండ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, ప్రతిరోజూ నీరు పోసి పెంచాలని పంచాయతీ కార్యదర్శి జగదీష్ కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, చిమటా సుధాకర్, పంచాయతీ సిబ్బంది, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

పామూరు: స్వర్ణగ్రామాలు, స్వచ్ఛ గ్రామాలు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను శుభ్రంచేశారు. పువ్వాడి వెంకటేశ్వర్లు,యారవ శ్రీనివాసులు, ఇర్రి కోటిరెడ్డి, పీఎస్‌లు పాల్గొన్నారు.

పీసీపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి పానకాలరావు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మండల పరిధిలోని పీసీపల్లి, మారెళ్ల గ్రామాల్లో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ, డిప్యూటీ ఎంపీడీఓ రాంప్రసాదు తదితరులు ఉన్నారు.

కనిగిరిరూరల్: స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బీట్ ది హీట్ అంశంపై పర్యావరణ పరిరక్షణపై జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం, మజ్జిగ పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్, మున్సిపల్, సచివాలయ, ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకొని పెంచాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ నిర్వహిచారు. . ఏఈ శ్రీకాంత్, ఏపీఓ వినయ్, గోనా రమేష్, కార్యదర్శులు సకిలా, లక్ష్మీ, లక్ష్మణ్, గంగాధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

పామూరు: ప్రజాసమస్యలపై వచ్చిన అర్జీలను సచివాలయ సిబ్బంది త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీదారులను కార్యాలయం చుట్టూ పనుల కోసం తిప్పుకోవద్దని మండల ప్రత్యేకాధికారి, జిల్లాపరిశ్రమలశాఖ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొట్లగూడూరు సచివాలయాన్ని శనివారం మండల ప్రత్యేకాధికారి స్థానిక ఎంపీడీఓతో కలిసి ఆకస్మికక తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీచే సిన ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలపై సిబ్బందితో చర్చించారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఈఓపీఆర్‌డి జి.అరవిందారెడ్డి, హౌసింగ్ ఏఈ రాజమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఓ శ్రీనివాసరావు

వైభవంగా వేంకటేశ్వరుని జలాధివాసం


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుర్రా, నేతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బాలుపల్లెలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా శనివారందేవతామూర్తుల మూల విగ్రహమూర్తులకు జలాధివాసం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు. బుర్రాను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. పీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ ట్రేడ్‌యూనియర్ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బజాజ్‌బుజ్జి, ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ బొట్లా చిరంజీవి, మేకల బాలుయాదవ్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల పరిషత్ సమావేశం

కొండపి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ కొండసింగు స్వప్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు వారి శాఖలకు సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశాన్ని మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభించారు. ఎంపీడీవో రామాంజనేయులు మాట్లాడుతూ బంగారు బాల్యంలో భాగంగా సున్నా నుంచి ఆరు సంవత్సరాల్లోపు బాలబాలికలకు ఆధార్ కార్డు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాలు పడే సమయంలో విద్యుత్ కోతలు తక్కువగా ఉండే విధంగా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. మండల విద్యాశాఖ అధికారి-2 రామారావు, తహసీల్దార్ పి.మురళి, వైస్ ఎంపీపీ రావులపల్లి కోటరాజు, ఈఓఆర్డీ అంజలీదేవి, ఏవో రామకృష్ణ, ఏపీవో వెంకటరావు, ఏపీఎం గోపీనాథ్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాదరావు, పంచాయతీ సెక్రటరీలు, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు...

ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్య సమావేశాన్ని కోరం కోసం ఎదురుచూసి మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభించారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలు చదవడం ప్రారంభించారు. కొన్ని శాఖల అధికారులు నివేదికలు చదివిన వెంటనే సమావేశ హాలు విడిచి వెళ్లారు. కొంతమంది అధికారులు రిజిస్టర్లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. మండలంలో సమస్యలపై చర్చించడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్తిగా అధికారులు నిర్లక్ష్యం కనిపించగా, ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి హాజరుకాకపోవడం , ప్రజా సమస్యల పరిష్కారంపై ఆసక్తి చూపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధ్యాహ్నం 1:30కు కూడా నలుగురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి


కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నాయకుడు కేజీ మస్తాన్

కొండపి: ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నాయకుడు కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మిట్టపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేజీ మస్తాన్ మాట్లాడుతూ వారానికి ఒకసారి ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వాలు చెప్పినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం.. నిలిచిన వేతనాలకు వడ్డీ కలిపి ఇవ్వాలని ఉందని, ఆ మేరకు పెండింగ్ బకాయిలకు వడ్డీతో సహా కూలీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. 20వ తేదీ జరిగే నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఉపాధి హామీకి ఉరివేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని కోరారు. క్షేత్ర స్థాయి సిబ్బందిపై రాజకీయ నాయకుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, యోసేపు, ఆదాము, జయమ్మ, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కొండపి: మన చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని కొండపి ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం క్లీన్ ప్రకాశం-గ్రీన్ ప్రకాశం కార్యక్రమాన్ని ముప్పవరం గ్రామంలో ప్రారంభించారు. ప్రజలతో ఎంపీడీవో ప్రతిజ్ఞ చేయించారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అంజలీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ఏవో రామకృష్ణ, సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన పాలేటి గంగమ్మ తిరునాళ్లు


అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం సమీపంలో పాలేటి నది ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లి తిరునాళ్ల నాలుగు రోజుల క్రితం ప్రారంభమై శనివారంతో ముగిసింది. సుమారు తొమ్మిది విద్యుత్ ప్రభలు చూపర్లను అబ్బుర పరిచాయి. గంగంపల్లి భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బయట ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో చేరుకొని తిరునాళ్లను వీక్షించారు. గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీ స్థాయిలో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం ఎదురుగా ఉన్న రావి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. బొల్లావులకు ఇక్కడికి వచ్చే ముద్రలు వేయించుకుంటారు. ఇక్కడ వేయించుకుంటే ఎక్కడైనా అవి చలామణిలో ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. పక్క రాష్ట్రాల నుంచి, పక్క జిల్లాల నుంచి కూడా వచ్చి బొల్లావులకు ముద్ర వేయించుకుంటారు.


ముద్ర వేయించుకున్న అనంతరం వెళ్తున్న బొల్లావులు